బాబోయ్ భౌ



- వీధుల్లో గుంపులుగా సంచారం
- చిన్నారులు, వృద్ధులపై దాడి
- చీకటి పడిన తర్వాత రోడ్డుపైకి రావాలంటే హడల్



భెల్ టౌన్ షిప్‌లో రాత్రి వేళ కుక్కల సంచారం



అక్కిరెడ్డిపాలెంలో పట్టపగలు గుంపుగా కుక్కల సంచారం



పిల్లలతో తల్లి కుక్క

అక్కిరెడ్డి పాలెం: వీధి కుక్కలు టెర్రర్ పుట్టిస్తున్నాయి. రాత్రులు రోడ్డుపైకి రావాలంటే జనం జడుస్తున్నారు. రోడ్డుపై గుంపులుగా చేరి పాదచారులను, వాహనచోదకులకు హడలెత్తిస్తున్నాయి. భెల్ టౌన్ షిప్, అక్కిరెడ్డిపాలెం, రాంనగర్, నాతయ్యపాలెం, తుంగ్లాం, శీలానగర్, హరిజనజగ్గయ్యపాలెం, వెంకటేశ్వరకాలనీ ఇలా ఏ ప్రాంతం అయినా కుక్కల బెడదతో స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. నిత్యం ఏదో ఒక చోట వీటి బారిన పడుతున్నారు. రోడ్లపై ఉన్న కుక్కలను తప్పించబోయి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అర్ధరాత్రి సమయంలో కుక్కలు గుంపులుగా చేరి ఒకదానిపై ఒకటి దాడులు చేసుకుంటూ బిగ్గరగా అరుస్తూ నిద్రాభంగం కలుగజేస్తున్నాయి. భెల్ టౌన్ షిప్ పక్కనున్న తుంగ్లాం గ్రామాలకు చెందిన కుక్కలు భారీగా చేరి రోడ్లపై సంచరిస్తూ భయానక వాతావరణం సృష్టిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఒక వైపు జీవీఎంసీ కుక్కల నియంత్రణ చేపడుతుందని, పిల్లలు పుట్టకుండా నియంత్రణ ఆపరేషన్లు చేసి తిరిగి వదిలిపెడుతున్నామని చెబుతున్నా అటువంటి దాఖలాలు కనిపించడం లేదు. ఇప్పటికే కుక్కలు పదుల సంఖ్యలో పిల్లలు పెట్టి వాటి సంతతిని వృద్ధి చేసుకుంటున్నాయి. వీధి కుక్కలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

తిప్పల దేవన్‌రెడ్డికి అభినందనలు



తిప్పల దేవన్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న బొడ్డ గోవింద్ తదితరులు

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన తిప్పల దేవన్‌రెడ్డికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. వైఎస్సార్ సీపీ నాయకుడు బొడ్డ గోవింద్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు దేవన్‌రెడ్డిని శనివారం కలిశారు. కార్యక్రమంలో బొడ్డ సన్యాసిరావు, ఎల్ఐసీ నాయుడు, చిత్రాడ రాజు, పిడుగురాళ్ల రెడ్డి, దుగ్గపు నరసింహమూర్తి, గెద్దాడ నాగరాజు, హరీష్ వర్మ, పిన్నింటి సంతోష్, ఆడారి శ్రీను, బొడ్డ వెంకట సూరి, మళ్ల సతీష్, సన్యాసిరావు, పోలాకి శ్రీను, రవి, వెంకట్రావు, శ్రావణ్, వాసు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

డీఐసీ జీఎం ఆదిశేషు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఐసీ జీఎం ఆదిశేషు

అక్కిరెడ్డిపాలెం: మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదిగేందుకు ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ఎంతో తోడ్పాటు అందిస్తుందని డీఐసీ జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు అన్నారు. ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటీ ఆధ్వర్యంలో ఆటోనగర్ డి – బ్లాక్‌లో భారత ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ అధికారులు శనివారం వాసవీ భవనంలో లబ్ధిదారులకు విశ్వకర్మ పథకంలో భాగంగా వాషర్ మ్యాన్, బోట్ మేకర్ ట్రేడ్‌లతో పాటు పలు సాంప్రదాయక పథకాలపై అవగాహన కార్యక్రమంతో పాటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ మహిళ విశ్వకర్మ పథకంలో ప్రవేశపెట్టిన 18 రకాల్లో వారికి వర్తించే పథకాన్ని ఎంపిక చేసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వారికి జిల్లా పరిశ్రమల కార్యాలయం ద్వారా వర్తించే సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఎంఎస్ఎంఈ ఏడీ, ప్రోగ్రాం కో – ఆర్డినేటర్ జంగం చంద్రమౌళి పథకాల వివరాలు, పథకాలకు ఎవరు అర్హులు, దరఖాస్తు విధానంతో పాటు విధి విధానాలను వివరించారు. కార్యక్రమంలో 68 మంది మహిళలు, 18 మంది పురుషులు పాల్గొన్నారు. సీఎస్‌సీ జిల్లా మేనేజర్ అల్లు జగదీష్, సీఎస్‌సీ ఆపరేటర్ రాజు దరఖాస్తులు నమోదు చేశారు. కార్యక్రమంలో వాసవీ అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, జీవీఎంసీ ఏపీడీ పి.దుర్గా ప్రసాద్, ఐలా మాజీ చైర్మన్ వై.సాంబశివరావు, ఎంఎస్ఎంఈ ఏడీలు అపర్ణ, మహావీర్, సిబ్బంది సుబ్బారావు, సతీష్ పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని ధర్నా



స్టీల్‌ప్లాంట్ సీజీఎం మొహంతికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. జీతాల అంశంపై యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పెండింగ్ జీతాలు చెల్లించాలని, హెచ్ఆర్ఏ పునరుద్ధరించాలని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని, విశ్రాంత ఉద్యోగుల మెడికల్ స్కీమ్‌లో మార్పులు ఉపసంహరించి పాత పద్ధతి కొనసాగించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులకు రెండున్నర నెలల జీతం పెండింగ్‌లో పెట్టడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉద్యోగుల జీతాల నుంచి మీల్ కార్డు నగదు ఉపసహరించి వాటిని మీల్ కార్డుకు పంపకపోవడం దుర్మార్గమన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీజీఎం (వర్క్స్) రంజన్ మొహంతి, హెచ్ఆర్ జీఎం ఎస్ భానులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, రమణమూర్తి, రాజు, కారు రమణ, జీవీ సుబ్బయ్య, కొమ్ము ప్రసాద్, ఎస్. రమేష్‌కుమార్, ఎస్.ఎ. నాయుడు, మొల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా కేంద్రీయ విద్యాలయం స్పోర్ట్స్ డే



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ వంశీకృష్ణ



విద్యార్థుల ప్రదర్శన

ఉక్కునగరం: స్థానిక కేంద్రీయ విద్యాలయంలో శనివారం క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 39వ వార్షిక క్రీడా దినోత్సవం సందర్భంగా పాఠశాల క్రీడా మైదానంలో వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పోటీల్లో పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యాలయం ప్రిన్సిపాల్ ఈ.వి.ఎల్.ఎన్. వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించాలన్నారు. ఈ సందర్భంగా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అదే విధంగా ఈ ఏడాది జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రత్యేక బహమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీఈటీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్, వనితా క్లబ్ నూతన కమిటీల ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న వాసవి, వనితా క్లబ్‌ల నూతన కమిటీలు

అగనంపూడి: వాసవి, వనితా క్లబ్ (85,88 వార్డులు)లకు నూతన కమిటీలను శనివారం ఎన్నుకున్నారు. వాసవి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా పుట్టా రమేష్, వరహాలశెట్టి, కోశాధికారిగా శ్రీనాడు రమేష్, వనితా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా కనక మహాలక్ష్మి, బి.మంగ, కోశాధికారిగా పి.లలితను ఎన్నుకున్నారు. వీరితో వాసవిక్లబ్ జిల్లా గవర్నర్ కె.పార్వతి ప్రమాణాస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వాసవి క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు శ్రీనాథు శ్రీను మాట్లాడుతూ క్లబ్‌ల ద్వారా చేపడుతున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను వివరించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

- గాజువాకలో భారీ అవగాహన ర్యాలీ
- సీనియర్ ఓటర్లకు సత్కారం



80 ఏళ్లు దాటిన ఓటర్లను సత్కరిస్తున్న అధికారులు



గాజువాక పోలీస్ స్టేషన్ జంక్షన్‌లో మానవహారం

గాజువాక: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గాజువాకలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాజువాక తహసీల్దార్ కార్యాలయం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం నుంచి వందడుగుల రోడ్‌లో పోలీస్ స్టేషన్ జంక్షన్ వరకు నిర్వహించిన ర్యాలీని గాజువాక ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్వో) బి.దయానిధి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కుపై యువతలో చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రాథమిక బాధ్యతగా గుర్తించాలన్నారు. 18 ఏళ్లు నిండి యువతీ యువకులు ఓటర్లుగా నమోదు కావాలన్నారు. ఓటును నిజాయితీగా వేసినప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందన్నారు. ఓటు వజ్రాయుధమని, సద్వినియోగం చేసుకుందామన్నారు. అనంతరం ఉద్యోగులు, యువత ప్రతిజ్ఞ చేశారు. 80 ఏళ్ల దాటిన ఓటర్లకు సన్మానం చేశారు. ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గాజువాక తహసీల్దార్ టి.శ్రీవల్లి, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు కీలకం

పెదగంట్యాడ: ఓటు వజ్రాయుధం..ఆ ఓటు హక్కుతో మీ భవిష్యత్‌ను చక్కదిద్దుకోవాలని జీవీఎంసీ 77వ వార్డు చాపలపాలెం ఎంపీపీ పాఠశాల హెచ్ఎం వినోద్‌కుమార్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం చాపలపాలెం గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటును సక్రమంగా ఉపయోగించాలన్నారు. అనంతరం గ్రామస్తులతో ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న చాపలపాలెం విద్యార్థులు

ఆకట్టుకున్న నమూనా ఓటింగ్

గాజువాక: ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించడంలో భాగంగా స్థానిక భాస్కర్ విద్యాలయంలో శనివారం నమూనా ఓటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఓటర్లు, పోలింగ్ అధికారులు, నాయకుల అవతారమెత్తారు. ఎన్నికల ప్రచారం మొదలుకొని ఓటింగ్ నిర్వహణ వరకు జరిగే ప్రక్రియపై ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. రహస్య ఓటింగ్ పద్ధతిలో విద్యార్థులు తమ సీపీఎల్, ఎస్‌పీఎల్‌లను ఎన్నుకున్నారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండినవారంతా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఎస్.శిరీష, బి.సునీత, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఓటు వేయడానికి క్యూలైన్‌లో విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులతో హెచ్ఎం కాంతం, ఉపాధ్యాయులు

అక్కిరెడ్డిపాలెం: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని గాజువాక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన వ్యాసరచన, ముగ్గుల పోటీల్లో అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటారు. ఎలక్షన్ అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో డి.మహిమ ద్వితీయ బహుమతిని, వ్యాసరచన పోటీల్లో సీహెచ్.కుమార్ తేజ ద్వితీయ స్థానాన్ని, ముగ్గుల పోటీలో జి.రేష్మ ప్రథమ స్థానాన్ని, చిత్రలేఖనంలో కె.తేజశ్రీ ప్రథమ బహుమతి సాధించారు. వీరిని పాఠశాల హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.రవిచంద్, దేముళ్ల పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

పెదగంట్యాడ: గ్రామీణ క్రీడల అభివృద్ధిలో భాగంగా అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో శనివారం గంగవరం గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. తొలి రోజు మ్యాచ్‌లు ఉత్సాహంగా సాగాయి.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

రూ. 1,11,400 స్వాధీనం

పెదగంట్యాడ: మండలంలోని వుడా కాలనీలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న ఏడుగురిని న్యూపోర్టు పోలీసులు శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. వివరాలు.. వుడా కాలనీలో ఓ బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో స్పెషల్ బ్రాంచ్ అధికారులు న్యూపోర్టు సిబ్బందితో కలసి దాడులు చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి వారి నుంచి రూ.1,11,400 నగదు 7 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. న్యూపోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా సీతారాముల పరస మహోత్సవం



పూజలందుకున్న సీతారామ లక్ష్మణ స్వాములు



ఆలయం ఎదుట నిర్వహిస్తున్న గరిడీ



స్టాళ్ల వద్ద కొనుగోలుదారుల సందడి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీలో సీతారాముల పరస మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. వేకువ జాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. సాయంత్రం పరస మహోత్సవంలో రోడ్లన్నీ జనాలతో కిక్కిరిసిపోయాయి. పరసలో ఏర్పాటు చేసిన పలు రకాల స్టాళ్ల వద్ద కొనుగోలుదారులతో సందడి నెలకుంది. వీధులన్నీ విద్యుత్ దీపాలతో వెలుగులు విరజిమ్మాయి. ఆలయం ఎదుట నిర్వహించిన గరిడీ, సాము గరిడీ వంటి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సగర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

అన్ని వార్డుల్లో మౌలిక వసతులు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక: జీవీఎంసీ 70వ వార్డులోని వివిధ కాలనీల్లో రూ.3.40 కోట్ల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో కోట్లాది రూపాయలతో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు మాట్లాడుతూ ఎల్వీ నగర్, ఎల్‌బీఎస్ నగర్, శ్రామికనగర్, శ్రీనివాసనగర్, టీవీఎస్ కాలనీ, గోవర్ధనగిరి నగర్, చట్టివానిపాలెం గ్రామాల్లో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, సీసీ డ్రైన్‌లు, మెట్ల మార్గం నిర్మించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వార్డు నాయకులు కొణతాల రాము, బొడ్డేడ రమణ, సత్యారావు, లంకల మురళీదేవి, రామకృష్ణరాజు, శంకరరావు, చట్టి గోపి, పాల రమణ, బాబులునాయుడు, రాపేటి గోవింద్, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సత్యసాయి పల్లకీ సేవలో ఉక్కునగరం భక్తులు



పల్లకీ సేవలో సత్యసాయి భక్తులు

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవా సమితి భక్తులు ఆధ్వర్యంలో పుట్టపర్తిలో సత్యసాయి పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ఉక్కునగరం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో 1999లో ఒకటో పుట్టర్తి యాత్ర మొదలు పెట్టారు. అప్పటి నుంచి ఏటా క్రమం తప్పకుండా పుట్టపర్తి వెళ్లి పల్లకీ సేవ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సత్యసాయి సేవా సమితికి చెందిన 240 మంది భక్తులు 27వ పర్తి యాత్ర కోసం పుట్టపర్తి చేరుకున్నారు. అక్కడ ప్రశాంతి నిలయం నుంచి సత్యసాయి జన్మస్థలం శివాలయం వరకు భజనలు ఆలపిస్తూ పల్లకీ సేవ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సమితి కన్వీనర్ జి. రామకృష్ణ, బీర బాబూరావు, టి.వి. మురుగానందం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు నివాళి



వైఎస్సార్‌సీపీ కార్యకర్త శివ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దేవన్‌రెడ్డి

అగనంపూడి: నూతన సంవత్సర వేడుకల్లో మందుగుండు సామగ్రి పేలి ప్రమాదవశాత్తు మృతి చెందిన వడ్లపూడి రజక వీధికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సిద్ధమళ్ల శివకు వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివ కుటుంబానికి ధైర్యం చెప్పి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. శివ పార్టీకి చేసిన సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, నాయకులు పారిపల్లి పాపారావు, వడ్లపూడి ఈశ్వరరావు, శ్రీను, పిడికి రమణ పాల్గొన్నారు.

కుంచమాంబ, దుర్గమాంబ పరస నేడు



కుంచమాంబ, దుర్గమాంబ అమ్మవార్లు

అక్కిరెడ్డిపాలెం: గాజువాక నియోజకవర్గంలోనే అతి పెద్ద తీర్థమహోత్సవం కుంచమాంబ, దుర్గమాంబ అమ్మవార్ల పరసను ఆదివారం వైభవంగా నిర్వహించనున్నట్లు అక్కిరెడ్డిపాలెం అమ్మవార్ల ఆలయ కమిటీ ప్రతినిధులు శనివారం తెలిపారు. తీర్థమహోత్సవంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సాముగరిడీ, తప్పెటగుళ్లు, కోలాటం, భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు చెప్పారు.

శ్రీవారికి విశేష పూజలు



శ్రీ వారికి తోమాల సేవ నిర్వహిస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమలేశునికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం ఏకాదశి పురస్కరించుకొని ఆలయంలో వేకువ జామునే స్వామికి సుప్రభాత సేవ, తోమాల సేవ నిర్వహించారు. సామూహిక భగవద్గీత పారాయణం, గీతా పారాయణ చేశారు. విశేష పుష్పాలతో సహస్ర నామార్చన నిర్వహించారు. తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు.